సాక్షి
పెద్దపల్లి
సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025



ఓదెల మల్లన్నకు మొక్కులు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. స్వామివారికి పట్నాలు వేసి, బోనంతో నైవేద్యం సమర్పించిన భక్తులు.. మల్లన్నకు మొక్కులు చెల్లించారు.



బొడ్డెమ్మకు వీడ్కోలు

మంథని: వారం క్రితం బొడ్డెమ్మ ఆటలు ప్రారంభించిన బ్రాహ్మణ సామాజికవర్గ మహిళలు ఆదివారం రాత్రి బొడ్డెమ్మకు వీడ్కోలు పలికారు. ఊరేగింపులో కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది.

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. జిల్లాలోని పలు చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'సర్కార్ వైఫల్యమే కారణం'



మాట్లాడుతున్న సురేశ్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: రైతు సంక్షేమమే ధ్యేయమంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పాలకులు.. కేంద్రంలోని బీజేపీ సర్కార్ సరిపడా యూరియా అందించినా రైతులకు పంపిణీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరి సాగు చేస్తున్న రైతుల కోసం 6.12లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని రాష్ట్రం విన్నవించగానే కేంద్రప్రభుత్వం సమకూర్చిందన్నారు. రాష్ట్రంలో 1.76లక్షల నిల్వలు ఉన్నా కొరత ఏర్పడడం సందేహాలకు తావిస్తోందని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని రైతులకు సరిపడా యూరియా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, జీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు కనుకుంట్ల జోగేందర్, నాయకుడు బొడ్డుపల్లి కుమార్ పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలే శరణ్యం



మాట్లాడుతున్న టి.శ్రీనివాస్

గోదావరిఖని: కార్మికుల హక్కుల సాధన కోసం గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ ఐక్య ఉద్యమాలకు ముందుకు రావాలని జీఎల్‌బీకేఎస్ గౌరవ సలహాదారు టి.శ్రీనివాస్ కోరారు. స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు ఎన్నికల సందర్భంగా ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నేతలు.. కార్మికులకు ఆదాయ పన్ను, పెర్క్స్‌పై ఇన్‌కంట్యాక్స్ రద్దు, సొంత ఇంటి పథకం, నూతన గనుల ఏర్పాటు, వారసత్వ ఉద్యోగాలు తదితర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చాయని గుర్తుచేశారు. ఆ హామీలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. హామీల అమలుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన కోరారు. నాయకులు జె.సీతారామయ్య, ఎ.వెంకన్న, డి.బ్రహ్మానందం, ఎండీ రాసుద్దీన్, గౌని నాగేశ్వరరావు, ఇ.నరేశ్, టి.శ్రీనివాసు, జి.మల్లేశ్, ఎస్.నర్సింగం, ఐ.రాజేశం, ఎం.సిద్దయ్య, కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


నేడు బంద్ పాటించాలి



పోస్టర్ అందిస్తున్న చందర్, నాయకులు

జ్యోతినగర్(రామగుండం): మేడిపల్లి సెంటర్‌లోని నిర్మాణాల కూల్చివేతల్లో పారదర్శకత పాటించాలనే డిమాండ్‌తో సోమవారం చేపట్టిన పట్టణ బంద్‌ను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. తొలుత మెయిన్ రోడ్డు వెడల్పు 40 అడుగులు విస్తరించాలని మార్కింగ్ ఇవ్వగా, దానిని 35 అడుగులకు కుదించి మార్కింగ్ ఇచ్చారన్నారు. మున్సిపల్ సిబ్బంది మళ్లీ 40 అడుగుల వరకు విస్తరించాలని, ఈక్రమంలో అవరోధంగా ఉన్న కట్టడాలను కూల్చివేయాలనడంతో వ్యాపారులు భయభ్రాంతులకు గురవుతున్నారని మండిపడ్డారు. బల్దియా సిబ్బంది తీరు సరికాదన్నారు. ఈమేరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పట్టణ బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ప్రచార పోస్టర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానికులు, నాయకులు పాల్గొన్నారు.

మిలాద్ ఉన్ నబీ ర్యాలీ



ర్యాలీలో ముస్లింలు

గోదావరిఖనిటౌన్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా నగరంలో ఆదివారం ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీనగర్ మదర్సా నుంచి ప్రధాన చౌరస్తా వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ నాయకులు మహమ్మద్ నసీర్, షేక్ హాజీ అలీ, మహమ్మద్ షరీఫ్, ఉమర్, హబీబ్, గులాం సాబ్రి, గౌస్, కలీమ్, నజీమొద్దీన్, షేక్ అలీ, రియాజ్, ముబీన్, జానీ పాల్గొన్నారు.

బోనస్ కోసం నిరీక్షణ

- అన్నదాతలకు తప్పని పడిగాపులు
- యాసంగి ధాన్యం సేకరణ పూర్తి
- మూడు నెలలు గడిచినా ఇంకా అందని బకాయిలు
- నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- అదేబాటలో సీడ్ కంపెనీలు, మిల్లర్లు
- అధికారులు చొరవ చూపాలంటున్న రైతులు



సాక్షి పెద్దపల్లి: యాసంగి ధాన్యం కొనుగోళ్లు పూర్తయి సుమారు మూడు నెలలు దాటింది. అయినా, సన్నరకం ధాన్యం తాలూకు బోనస్ రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమకాలేదు. ఇదే అదనుగా రైతుల నుంచి సీడ్ వడ్లు కొనుగోలు చేసిన పలు కంపెనీలు, మిల్లర్లు సైతం బోనస్ చెల్లించడం లేదు. దీంతో చేతిలో డబ్బుల్లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే బస్తాపై రెండు కేజీల నుంచి మూడు కేజీల వరకు కోత పెట్టి అడ్డగోలుగా దోచుకుంటున్న రైస్ మిల్లర్ల బారినుంచి తప్పించుకునేందుకు రైతులు సీడ్‌వడ్లు సాగుచేసైనా లబ్ధిపొందుతామనుకుంటే.. ఇక్కడ కూడా మోసానికి గురికాక తప్పడం లేదు. సీడ్ సాగు చేసిన రైతులకు బోనస్ చెల్లిస్తామని మూడు నెలల క్రితమే సన్నవడ్లు సేకరించిన మిల్లర్లు.. ఇప్పటివరకు డబ్బులు చెల్లించకుండా ఎగనామం పెట్టేందుకు సిద్ధమవుతున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లాభం సీడ్ మిల్లర్లకే.

సాధారణంగా రైతుల నుంచి సేకరించిన సన్నరకం ధాన్యాన్ని శుద్ధి చేసి 25 కిలోల చొప్పున బ్యాగుల్లో నింపి బస్తాకు కొంత లాభం చూసుకొని వ్యాపారులు ధర నిర్ణయించి విక్రయిస్తుంటారు. గతేడాది 25 కిలోల విత్తన సంచిని లోకల్ మార్కెట్లో రూ.900 నుంచి రూ.950 ధరతో విక్రయించగా ఇతర రాష్ట్రాలకు రూ.1,249 ధర ముద్రించి విక్రయించారు. గతేడాది ప్రభుత్వం బోనస్ ప్రకటించలేదు. ఈ ఏడాది బోనస్ ప్రకటించింది. దీంతో రైతులు సీడ్ మిల్లు యజమానులతో ప్రభుత్వం ఇస్తున్నట్లు బోనస్ ఇవ్వాలని, క్వింటాల్‌కు రూ.2,820 చెల్లిస్తేనే ధాన్యం విక్రయిస్తామని రైతులు తేల్చి చెప్పారు. దీంతో రైస్‌మిల్లు యజమానులు ధర పెంచారు. వ్యాపారులకు 25 కిలోల విత్తన సంచికి ధర పెంచి రూ.1,050 నుంచి రూ.1,100 వరకు విక్రయించారు. అంటే.. క్వింటాల్‌కు రూ.600 లాభంతో అమ్మకాలు సాగిస్తున్నారు. కానీ, రైతులకు ఇచ్చే బోనస్ మాత్రం చెల్లించడం లేదు.

జిల్లా సమాచారం..

ధాన్యం కొనుగోలు కేంద్రాలు	315
సన్నధాన్యం విక్రయించిన రైతులు	77,761
జమకావాల్సిన బోనస్(రూ.కోట్లలో)	39.8
సీడ్ సాగు చేసిన రైతులు(సుమారు)	5,000
మిలర్లకు విక్రయించిన ధాన్యం	40,000 (మెట్రిక్ టన్నుల్లో)

ఎగవేతకు యత్నం..

ముందుగా క్వింటాల్‌కు రూ.2,820 ధర ఇస్తానని చెప్పి ఇప్పుడేమో తగ్గించి ఇస్తామంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు అమ్మిన వడ్లకు డబ్బులు ఇవ్వకుండా నెలల తరబడి జాప్యం చేస్తుండగా.. మరోవైపు బోనస్ విషయంలో స్పష్టత ఇవ్వకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. క్వింటాల్‌కు రూ.2,820కి బదులు రూ.2,500 మాత్రమే ఇస్తామని అంటున్నారని, మరికొందరు మద్దతు ధర రూ.2,320 ఇస్తామంటున్నారని పేర్కొంటున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో సీడ్ వరి సాగవుతోంది. ఇక్కడ పండిన సన్నవడ్ల విత్తనాలకు నాణ్యతపరంగా ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. ఏటా ఇక్కడి సీడ్ మిల్లు వ్యాపారులు రైతుల నుంచి ధాన్యం సేకరించి, మిల్లుల్లో శుద్ధి చేసి విత్తనాలుగా విక్రయిస్తుంటారు. ఈఏడాది యాసంగిలోనూ సాగు చేసిన వరిలో సగానికిపైగా విత్తనాల కోసం ధాన్యం సేకరించారు. అయితే, ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో మద్దతు ధర రూ.2,320కు బోనస్ కలిపి రూ.2,820 ఇస్తామని చెప్పి సుమారు 5 వేల మంది రైతుల నుంచి దాదాపు 40 వేల టన్నుల వరకు ధాన్యం తీసుకున్నారు. డబ్బులు అత్యవసరం ఉన్న కొందరు రైతులకు క్వింటాల్‌కు రూ.2,500 చొప్పున చెల్లించగా.. మిగతా రైతులకు ఇప్పటివరకు రూపాయి కూడా ఇవ్వలేదు. జిల్లా యంత్రాంగం చొరవ చూపితేనే తమకు న్యాయం జరుగుతుందని పలువురు అన్నదాతలు వేడుకుంటున్నారు.

కంపెనీ విత్తనాలు వేసిన



గోపరపల్లిలో వరుణ్ సీడ్ కంపెనీ విత్తనాలతో పంట వేసిన. బోనస్ ఇస్తాం అంటేనే దొడ్డువడ్లు పక్కకు పెట్టి సీడ్ వడ్లు సాగు చేసిన. కింటాల్‌కు బోనస్ రూ.500 ఇస్తానన్నారు. ప్రభుత్వం బోనస్ ఇవ్వకపోవడంతో కంపెనీ వాళ్లు సైతం బోనస్ ఎగవేయడానికి ప్రయత్నిస్తున్నారు.

– కర్రే ప్రభాకర్‌రెడ్డి, రైతు, గోపరపల్లి

అధికారులు ఇప్పించాలి



నాకున్న పదెకరాల్లో వరుణ్ కంపెనీ సీడ్ వరి సాగు చేసిన. పెట్టుబడి రూ.3.60లక్షలు అయ్యింది. క్వింటాల్‌కు బోనస్‌తో కలిపి రూ.2,820 ఇస్తామన్నరు. ఇప్పుడేమో ప్రభుత్వం బోనస్ ఇవ్వడం లేదు కాబట్టి మేము ఇవ్వమంటున్నరు. అధికారులే బోనస్ ఇప్పించాలె.

– అమ్ముల మల్లేశ్, రైతు, హరిపురం

క్రీడాస్థలం అభివృద్ధికి కృషి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



క్రీడాస్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్, నాయకులు

ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రంలోని క్రీడా స్థలాన్ని అభివృద్ధి చేస్తామని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హామీ ఇచ్చారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని క్రీడా స్థలాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ, క్రీడామైదానం లేక యువకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ స్థలాన్ని మైనింగ్‌శాఖ ద్వారా అభివృద్ధి చేయిస్తానని మంత్రి అన్నారు. చుట్టూ ఉన్న బండలు, చెట్లను తొలగించి స్థలం చదును చేయించి అందుబాటులోకి తీసుకొస్తానని తెలిపారు. క్రీడా మైదానం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే గ్రామస్తులు వాకింగ్ చేసేందుకు అనువుగా ఉంటుందని అడ్లూరి వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, మాజీ వైస్ చైర్మన్ కాడే సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తోడేటి రాజలింగయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోగాల తిరుపతి, నాయకులు జంగ మహేందర్‌యాదవ్, ఓరం చిరంజీవి, పాలకుర్తి సాయిగౌడ్, ఎల్లయ్య, పొనవేని స్వామి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనలో ఐఎన్‌టీయూసీ విఫలం

- ఎన్టీపీసీ యునైటెడ్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు ఎన్.భిక్షపతి



మాట్లాడుతున్న నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ ఉద్యోగుల హక్కుల సాధనలో ఐఎన్‌టీయూసీ విఫలమైందని సీఐటీయూ అనుబంధ ఎన్టీపీసీ యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎన్.భిక్షపతి విమర్శించారు. పీటీఎస్‌లోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 25న ఎన్టీపీసీ ఉద్యోగ గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీఐటీయూ నక్షత్రం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఇప్పటికే రెండుసార్లు గెలిచిన ఐఎన్‌టీయూసీ అనుబంధ ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్.. అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. ఉద్యోగానంతరం వైద్య సౌకర్యం, పీఆర్ఎంఎస్ వర్తింపజేసేలా మార్పులు తీసుకొస్తామని, విద్యార్హతలను బట్టి ఫాస్ట్‌ట్రాక్ ప్రమోషన్ పాలసీ అమలు చేయిస్తామని, కిందిస్థాయి ఉద్యోగులకు కేరీర్ ప్రోగ్రాం అమలు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎన్టీపీసీ యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూమయ్య, ప్రధాన కార్యదర్శి ఈదునూరి రాజేశ్వర్, కోశాధికారి భిక్షపతి, హెచ్ఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ ఉపేందర్, సీఐటీయూ జిల్లా కోశాధికారి రామాచారి, నాయకులు రాజు, అశోక్ పాల్గొన్నారు.

వైకల్యాన్ని జయించి.. స్వయం ఉపాధి ఎంచుకుని ..

- విధిరాతను అధిగమిస్తూ ముందుకు..
- ఊరూరా తిరుగుతూ పగ్గాల విక్రయం
- ఆదర్శంగా నిలుస్తున్న 'ఆరుపదుల వ్యక్తి'



పగ్గాలు అమ్ముకునేందుకు వెళ్తున్న రాయమల్లు

మంథనిరూరల్: చిన్నతనంలోనే పోలియో బారినపడ్డాడు.. రెండుకాళ్లు చచ్చుబడిపోయినా ఏమాత్రం ధైర్యం కోల్పోలేదు.. విధిరాతను ఎదురించాడు.. ఆత్మస్థైర్యాన్ని ఆయుధంగా చేసుకున్నాడు.. అడుగు ముందుకు వేశాడు.. ఆరుపదుల వయసులోనూ ఉపాధి మార్గం ఎంచుకున్నాడు.. ఎంతోకొంత సంపాదిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు ఉప్పట్ల గ్రామానికి చెందిన కాసిపేట రాయమల్లు.

చిన్నతనంలోనే పోలియో బారినపడి..

రాయమల్లు చిన్నతనంలోనే పోలియో బారిన పడ్డాడు. కాళ్లు చచ్చుబడిపోయినా మొక్కవోని ధైర్యం నింపుకుని స్వయం ఉపాధి ఎంచుకున్నాడు. పెళ్లి చేసుకున్నాక కూడా ఎవరిపైనా ఆధారడకుండా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు ఒక కూతురు, ఒక కుమారుడు ఉండగా పదేళ్ల క్రితమే కూతురుకు వివాహం చేశాడు. కొడుకు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు.

పగ్గాలు, బుట్టలు తయారు చేస్తూ..

ఒకప్పుడు సింగరేణి సంస్థలో కార్డు ద్వారా ఇచ్చే బొగ్గును తీసుకువచ్చి అమ్ముకుని కుటుంబాన్ని పోషించేవాడు రాయమల్లు. ఆ తర్వాత చిన్నాచితక పనులు చేసేవాడు. ఇరవై ఆరేళ్లుగా ప్లాస్టిక్ సంచుల దారాలతో పగ్గాలు, బుట్టలు తయారు చేస్తూ విక్రయిస్తున్నాడు. వ్యవసాయం చేసే రైతులు తమ ఎడ్లకు అవసరమైన పగ్గాలు, బుట్టలను రాయమల్లు వద్దే కొనుగోలు చేస్తున్నారు.

జతపగ్గం ధర రూ.250తో విక్రయం..

నాలుగు రోజులు కష్టపడితే ఒకజత పగ్గం తయారు అవుతుంది. ప్లాస్టిక్ సంచులను చీరి, దారాలను వేరుచేసి పేని తయారు చేసిన జతపగ్గాలను రూ.250కు విక్రయిస్తున్నాడు. ఇలా నెలలో పదిజతల పగ్గాలు, పది జతల బుట్టలు తయారు చేస్తేనే కూలి గిట్టుబాటు అవుతుందని రాయమల్లు తెలిపాడు.

ఐదు కిలో మీటర్ల పరిధిలో..

సుమారు ఐదు కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలకు రాయమల్లు తన మూడు చక్రాల సైకిల్ సాయంతో తిరుగుతూ పగ్గాలు, బుట్టలు అమ్ముతున్నాడు. ఎడ్లకు పగ్గాలు, మూతికి కట్టే బుట్టలనే ఎక్కువగా వాడుతుంటారు. రాయమల్లు తయారు చేసిన పగ్గాలు, బుట్టలు నాణ్యంగా ఉంటాయని, అందుకే కొనుగోలు చేస్తుంటారని స్థానికులు చెబుతున్నారు.

ఆర్థికసాయం అందించాలి

రెండుకాళ్లు చచ్చుబడిపోయినా కుటుంబాన్ని సాకేందుకు ఎంతో కష్టపడుతున్న. ఏ పనులకూ నన్ను ఎవరూ పిలువరు. చేసేదేమీలేక ఉపాధి కోసం పగ్గాలు, బుట్టలు తయారు చేస్తున్న. ప్రభుత్వం, అధికారులు రుణం మంజూరు చేస్తే మరింత పనితనం మెరుగుపర్చుకుంట. మూడు చక్రాల సైకిల్ పనిచేయడం లేదు. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలి. – కాసిపేట రాయమల్లు, ఉప్పట్ల





తెల్లవారకముందే క్యూలైన్‌లో..

కాల్వశ్రీరాంపూర్: కూనారంలో..

సుల్తానాబాద్‌లో..

కాల్వశ్రీరాంపూర్/సుల్తానాబాద్/ ఓదెల (పెద్దపల్లి): యూరియా కోసం రైతులు తెల్లవారక ముందే సింగిల్‌విండో కార్యాలయాలు, ఆగ్రోస్ కేంద్రాలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల ఎదుట బారులు తీరుతున్నారు. ఆదివారం కూడా అన్నదాతలు అన్ని పనులు వదిలేసి మండల కేంద్రాలకు పరుగులు తీశారు. కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం, ఓదెల మండలం గూడెం, సుల్తానాబాద్ మండలం పూసాలలో అన్నదాతలు ఎరువుల కోసం గంటల తరబడి బారులు తీరి కనిపించారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి

- ఎన్టీపీసీ ఎన్బీసీ సభ్యుడు సుంకరి మల్లేశం



మాట్లాడుతున్న మల్లేశం, నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ ఉద్యోగుల సంక్షేమానికి బీఎంఎస్ అనుబంధ ఎన్టీపీసీ కార్మిక సంఘ్ కృషి చేస్తుందని ఎన్టీపీసీ ఎన్బీసీ సభ్యుడు, బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు సుంకరి మల్లేశం అన్నారు. ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్ జ్యోతిభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ నిర్వాసిత కోటాలో ఉద్యోగం పొందిన ఉద్యోగులకు పీఆర్ఎంఎస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కేరీర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(సీడీపీ)లో ప్రత్యేక శిక్షణ అందించి పదోన్నతులు కల్పించాలని కోరారు. గతంలో ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉండేదని, ప్రస్తుతం ఆ సంఖ్య వందలకు పడిపోయిందని అన్నారు. ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో యాజమాన్యానికి తెలియజేశామని ఆయన వెల్లడించారు. 2027లో జరిగే వేతన సవరణలో ప్రత్యేక భాగస్వామిగా నిలిచేందుకు బీఎంఎస్‌ను గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో బీఎంఎస్ అనుబంధ ఎన్టీపీసీ కార్మిక సంఘ్ అధ్యక్షుడు కేతిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాగర్ రాజు, నాయకులు బండారి కనకయ్య, పోగుల స్వామి, చల్లా సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, సతీశ్ కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన లేక.. సాయం అందక

- జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై అనాసక్తి
- ధ్రువీకరణ పత్రాల జారీలో ఇబ్బందులు కారణం
- నెరవేరని కేంద్రప్రభుత్వ లక్ష్యం.. బాధితులకు నిరాశ



ఎస్ఎఫ్‌బీఎస్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు(ఫైల్)

రామగుండం: కుటుంబాన్ని పోషించే యజమాని ఆకస్మికంగా మరణిస్తే.. ఆ కుటుంబానికి ఆర్థికంగా బాసటగా నిలిచేందుకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం – ఎన్ఎఫ్‌బీఎస్)ను కేంద్రప్రభుత్వం అమలు చేస్తోంది. దీనిద్వారా బాధిత కుటుంబానికి రూ.ఇరవై వేల సాయం అందుతుంది. 2017లోనే ఈ పథకం అమలులోకి వచ్చింది. అయితే, దీనిపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన లేక ప్రభుత్వ ఆశయం నెరవేరడంలేదు. అంతేకాదు.. ఆ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు బాధితులూ ఆసక్తి చూపడంలేదు. కుటుంబ సభ్యుల ధ్రువీకరణపత్రం జారీ విషయంలో రెవెన్యూ అధికారుల ద్వారా ఎదురయ్యే ఇబ్బందులు ఇందుకు కారణమవుతోంది.

ఏటా రూ.7వేల మందికి ప్రయోజనం కలిగేలా

ఎన్ఎఫ్‌బీఎస్ ద్వారా ఏటా 7,794 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చేలా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్థానికంగా ఉండే ఐకేపీ ప్రతినిధులు చెబుతున్నారు. వివిధ ప్రమాదాల్లో ఏటా లక్షల మంది మృత్యువాత పడుతున్నా.. కేవలం అవగాహన లేక బాధిత కుటుంబాలు ఈ పథకానికి దరఖాస్తు చేయలేకపోతున్నాయి. దీనికి గడువు అంటూ ఏమీ ఉండదని, అర్హులైన వారు దరఖాస్తు చేయాలని అంతర్గాం ఐకేపీ ఏపీఎం సదానందం, సీసీ రాంబాబు తెలిపారు.

ఎవరు అర్హులంటే..

- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని రైతుకూలీలు, కార్మికులు, తెల్లరేషన్‌కార్డు కలిగిన పేదలు ఎన్ఎఫ్‌బీఎస్ పథకానికి అర్హులు.
- మృతుల వయసు 18–60 ఏళ్ల మధ్య ఉండాలి. ఇందులో సాధారణ, ప్రమాద మరణం ఏదైనా సంభవిస్తే మరణించిన తేదీ నుంచి రెండేళ్లలోగా దరఖాస్తు చేసుకునే వీలుంటుంది.
- కులం, డెత్ సర్టిఫికెట్లు, ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకుఖాతా పుస్తకం, కుటుంబసభ్యుల వివరాలతో తహసీల్దార్ జారీ చేసే ధ్రువీకరణ పత్రం (ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్) దరఖాస్తుకు జతపరచాలి. దీనికి దరఖాస్తుదారు ఫొటో తప్పకుండా అతికించాలి.
- దరఖాస్తును రెవెన్యూ, ఇందిరా క్రాంతి పథం(ఐకేపీ) అధికారులు పరిశీలించి విచారణ చేపడతారు. ఆ తర్వాత ఆర్డీవోకు నివేదిస్తారు. ఆర్డీవో పరిశీలించి జెడ్పీ సీఈవోకు ఎండార్స్ చేస్తారు. ఆ తర్వాతే సీఈవో.. బాధిత కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాలో పరిహారం జమచేస్తారు.
- దరఖాస్తులను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలి.
- దరఖాస్తులో సందేహాలు ఉంటే స్థానిక ఐకేపీ/సెర్ప్ కార్యాలయంలో సంప్రదిస్తే ప్రతినిధులు నివృత్తి చేస్తారు.

ప్రభుత్వ పాఠశాలలకు రేటింగ్

- ప్రతిభ చూపిన స్కూల్‌కు రూ.లక్ష సాయం



సుల్తానాబాద్(పెద్దపల్లి): నాణ్యమైన బోధన, పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ.. ఇలాంటి అంశాల్లో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం రేటింగ్ ఇస్తోంది. సుమారు ఐదేళ్లక్రితం నిలిచిన ఈ పథకాన్ని ఇటీవల మళ్లీ పునరుద్ధరించింది. జిల్లాలో 543 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, అందులో 85,785 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం నియమించిన కమిటీలు స్కూళ్లలో తనిఖీలు చేసి మార్కులు కేటాయిస్తాయి. ఐదు పాయింట్లు సాధించిన పాఠశాలలకు కేంద్రప్రభుత్వం నేరుగా పురస్కారాలు అందిస్తుంది. జిల్లాస్థాయిలో కలెక్టర్, డీఈవో, జిల్లా వైద్యాధికారి, డీఈఈ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, ఉపాధ్యాయులతో కమిటీ ఏర్పాటు చేస్తారు. వచ్చే అక్టోబర్‌లో ఈ కమిటీ స్కూళ్లను తనిఖీ చేసి మార్కులు కేటాయిస్తుంది.

30 వరకు గడువు

రేటింగ్ సాధించి పురస్కారాలు అందుకునేందుకు ప్రభుత్వ పాఠశాలలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. ఇందుకోసం ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉంది. దరఖాస్తులను జిల్లాస్థాయిలో కమిటీ పరిశీలించి రేటింగ్ ఇస్తుంది. జాతీయస్థాయిలో ఎంపికైతే రూ.లక్ష ప్రోత్సాహకం అందుతుంది.

– మాధవి, డీఈవో

రైతులకు సరిపడా యూరియా

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

పాలకుర్తి(రామగుండం): రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సరిపడా యూరియా పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలో మండల వ్యవసాయశాఖ ఆదివారం యూరియా పంపిణీ చేయగా ఎమ్మెల్యే పర్యవేక్షించారు. గతంలో కన్నాల, మేడిపల్లి సింగిల్‌విండోల ద్వారా యూరియా పంపిణీ చేశారని, ప్రస్తుతం రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రెండు రైతువేదికల ద్వారా కూడా యూరియా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయాధికారి ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా రోలార్ స్కేటింగ్ పోటీలు


క్రీడాకారులతో అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్/కరీంనగర్‌రూరల్: అంబేడ్కర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి రోలార్ స్కేటింగ్ పోటీలకు స్పందన వచ్చింది. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి పోటీలు ప్రారంభించారు. క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అలాగే బొమ్మకల్‌లోని బిర్లా ఇంటర్నేషనల్ స్కూల్‌లో రోడ్ ఈవెంట్ స్టేట్ సెలక్షన్ పోటీలు నిర్వహించారు. స్కేటింగ్ బాధ్యులు విజయభాస్కర్, గట్టు అనిల్‌కుమార్‌గౌడ్, డి.వీరన్న, కృష్ణమూర్తిగౌడ్, సాయి నరహరి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు స్పందన


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: అంబేడ్కర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు స్పందన వచ్చింది. వివిధ మండలాల నుంచి సుమారు 150 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. అంతకుముందు తెలంగాణ కబడ్డీ సంఘం ఉపాధ్యక్షుడు సీహెచ్.సంపత్‌రావు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల్లో రాణించిన క్రీడాకారులను ఈ నెల 25 నుంచి నిజామాబాద్ జిల్లా ముప్కల్ మండలంలో జరిగే రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కబడ్డీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బుర్ర ఎల్లయ్యగౌడ్, సీహెచ్.మల్లేశ్, ప్రధాన కార్యదర్శి బుర్ర మల్లేశ్‌గౌడ్, పెటా కార్యదర్శి ఆడెపు శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు మాధవరెడ్డి, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల ల్యాండ్‌మార్క్ మిడ్‌మానేరు


తొలిసారి నీటి విడుదల సమయంలో ప్రాజెక్టు అందాలు

బోయినపల్లి(చొప్పదండి): తెలంగాణ ప్రాజెక్టులకు ల్యాండ్‌మార్క్‌లా మధ్యమానేరు నిలుస్తోంది. ఎగువ మానేరు, దిగువ మానేరుకు మధ్యలో ఉన్న మిడ్‌మానేరు 5.8 లక్షల క్యూసెక్కుల వరద పోటును తట్టుకుంటుంది. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద శ్రీరాజరాజేశ్వర(మధ్యమానేరు) ప్రాజెక్టును 27.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. సుమారు రూ.750 కోట్ల అంచనాలతో నిర్మించారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలో సుమారు 2లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2006లో దివంగత సీఎం వైఎస్సార్ ఈ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రాజెక్టు నిర్మాణంలో పాలుపంచుకున్న ఇంజినీర్లందరూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వారే. ప్రాజెక్టు మొత్తం 32 సీసీ కెమెరాల నిఘాలో ఉంటుంది. 25 రేడియల్ గేట్లు, పవర్ ప్యాక్స్, లోకల్ కంట్రోల్ ప్యానల్, రిమోట్ కంట్రోల్ ప్యానల్స్ వంటి కొత్త పద్ధతులు ఉన్నాయి. ప్రాజెక్టులో 4 రివర్స్ స్లూయిస్‌లు ఏర్పాటు చేశారు. ప్రాజెక్టులో చేరిన సిల్ట్ రివర్స్ స్లూయిస్‌ల ద్వారా బయటకు వెళ్తుంది. ప్రాజెక్టు నిర్మాణంలో సిమెంట్, కాంక్రీట్, మట్టి, రాతు, స్టీల్, వాడారు. ప్రాజెక్టు అడుగు భాగానికి వెళ్లడానికి గ్యాలరీని ఏర్పాటు చేశారు. దీనిలోకి వెళ్లడానికి మెట్లు, అధునాతన లిఫ్ట్ ఏర్పాటు చేశారు. ప్రాజెక్టులోకి వచ్చే నీరు నిల్వ చేయడం వల్ల ఎయిర్ వెళ్లడానికి గ్యాలరీలో పరికరాలు అమర్చారు. 500 మీటర్ల మేర స్పిల్‌వే, 10 కిలోమీటర్ల మేర కట్టను నిర్మించారు.



పవర్‌ప్యాక్ గది

చరిత్రకు సాక్ష్యం ఎలగందుల ఖిలా


ఎలగందుల ఖిలా

కొత్తపల్లి(కరీంనగర్): చరిత్రకు సాక్ష్యంగా కొత్తపల్లి మండలంలోని ఎలగందుల ఖిలా నిలుస్తోంది. కాకతీయులు, కులీకుతుబ్‌షాహీల శిల్ప కళావైభవానికి ప్రతీకగా ఖిలాలోని కట్టడాలు నిలుస్తున్నాయి. ఈ కోటలో టర్కీ, ఫ్రెంచ్ ఇంజినీర్ల ప్రభావం కనిపిస్తోంది. ఫ్రెంచి, టర్కీ ఇంజినీర్ల ప్రభావంతో ఈ కోట అనేక విషయాల్లో మధ్యయుగపు ఐరోపా శైలిని పోలి ఉంది. 200 అడుగుల ఎత్తు, 2.5 మైళ్ల విస్తీర్ణంలో మానేరునదిని ఆనుకొని ఉంది. ఎలగందుల కోటను కాకతీయులు 1083- 1323 మధ్య నిర్మించారు. ఈ కోటకు మొదటి పేరు 'వెలిగుండుల'. దీనిని ముసునూరి నాయకులు, రాచర్ల పద్మనాయకులు ధృడంగా తయారు చేశారు. కోట చుట్టూ సుమారు 5 కిలోమీటర్ల వెడల్పు, 4 మీటర్ల లోతు నీటి కందకాన్ని తవ్వించి మొసళ్లతో నింపి శత్రువుల నుంచి రక్షణగా ఏర్పాటు చేశారు. 16వ శతాబ్దంలో ఈ కోటను కుతుబ్‌షాహీలు ఆక్రమించారు. తర్వాత మొఘల్ సామ్రాజ్యాధీనంలోకి వచ్చింది. హైదరాబాద్ నిజాం పాలనలో నిజాం ఉల్ ముల్క్ అసఫ్‌జాహి (1724–1748) కాలంలో అమీన్‌ఖాన్ ఈ కోట ఖిలేదార్‌గా బాధ్యతలు చేపట్టారు. 1754లో నవాబ్ సలాబత్ జంగ్ కాలంలో మీర్జా ఇబ్రహీం దంసా ఈ కోటను పునర్‌నిర్మించారు. 1905లో ఆరో నిజాం మహబూబ్ అలీఖాన్ జిల్లా కేంద్రాన్ని ఎలగందుల్ నుంచి కరీంనగర్‌కు మార్చారు. కోటలో నీలకంఠస్వామి, లక్ష్మీనరసింహస్వామి ఆలయాలతోపాటు మసీదు హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయి.

చెక్కుచెదరని కట్టడాలు

- ఇంజినీరింగ్ ప్రతిభకు నిలువెత్తు సాక్ష్యాలు
- సాగు, తాగునీరు అందిస్తున్న ప్రాజెక్టులు
- ఉమ్మడి జిల్లాలో ఆకట్టుకునే నిర్మాణాలు
- నేడు ఇంజినీర్ల దినోత్సవం

ఇంజినీర్ల ప్రతిభకు నిలువెత్తు సాక్ష్యాలుగా ప్రాజెక్టులు నిలుస్తున్నాయి. వందల ఏళ్లుగా చెక్కుచెదరకుండా లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకొని తల ఎత్తుకొని సేవలందిస్తున్నాయి. నిజాం కాలంలో నిర్మించిన ఎగువమానేరు, ఐదు మత్తళ్ల సింగసముద్రం, అనంతారం ప్రాజెక్టు, మిడ్ మానేరు, ఎలగందుల ఖిలా.. చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇంజినీర్ల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పలు పాతకాలం నాటి నిర్మాణాలపై ప్రత్యేక కథనం.



నిజాం కాలంలో నిర్మించిన గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు


కాకతీయుల కాలంలో నిర్మించిన గంభీరావుపేట మండలం సింగసముద్రం చెరువు

గంభీరావుపేట(సిరిసిల్ల): ఇంజినీర్ల కృషి, ప్రతిభకు నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి గంభీరావుపేట మండలంలోని నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు, సముద్రలింగాపూర్‌లోని ఐదు మత్తడుల సింగసముద్రం చెరువు. నిజాం కాలంలో నిర్మించిన కట్టడాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా సాగు, తాగునీటిని అందిస్తున్నాయి.

స్వాతంత్ర్యానికి పూర్వమే..

గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు పనులు స్వాతంత్ర్యానికి పూర్వం 1945లో ప్రారంభమైంది. 1948–50 మధ్య పూర్తయింది. నిజాం కాలంలో దాదాపు 18 మంది ఇంజినీర్లు దీనినిర్మాణంలో భాగస్వాములయ్యారు. ప్రస్తుతం ఏళ్లు గడువక ముందే ప్రాజెక్టులు నేలకూలుతుంటే.. వందల ఏళ్లనాడు నిర్మించిన ఈ ప్రాజెక్టు ఇంజినీర్ల ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తుంది. మట్టి, రాయి, మిశ్రమంతో చేసిన బండ వంటి అందుబాటులోని పరిమిత సాంకేతికతతో నిర్మించారు. గంభీరావుపేట మండలం సింగసముద్రం చెరువు వంటి పురాతన నిర్మాణం ఇప్పటికీ సాక్ష్యంగా నిలుస్తోంది. కాకతీయుల కాలంలో నిర్మించిన సింగసముద్రం ఇప్పటికీ చుట్టుపక్కల గ్రామాలకు సేద్యం నీటిని అందిస్తోంది. కాలక్రమంలో ఆధునిక ఇంజినీర్లు దానిని ఐదు మత్తడుల చెరువుగా మార్చి వన్నె తెచ్చారు. ఆ యుగం ఇంజినీర్ల ప్రతిభను మన కళ్ల ముందు నిలబెట్టారు.


సైఫన్‌లోకి వెళ్తున్న ఎస్సారెస్పీ నీరు

అద్భుత కట్టడం.. నాగులపేట సైఫన్

- ఆసియాలోనే అరుదైన కట్టడంగా గుర్తింపు

కోరుట్ల రూరల్: ఇంజినీరింగ్ పనితీరుకు అద్భుత కట్టడంగా నిలుస్తుంది కోరుట్ల మండలం నాగులపేట వద్దగల సైఫన్. ఇది ఆసియాలో అరుదైన కట్టడాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అప్పటి సూపరింటెండెంట్ ఇంజనీర్ పీఎస్.రామకృష్ణారాజు సైఫన్ నిర్మాణానికి డిజైనింగ్ చేశారు. నాగులపేట వద్ద కాకతీయ కాలువ సుమారు 100 మీటర్ల వెడల్పుతో ప్రవహించే పెద్ద వాగు దాటాల్సి ఉంటుంది. వాగుకు అడ్డంగా కాలువ నిర్మించడం కష్టం కావటంతో వాగుపై నుంచే 100 మీటర్ల సొరంగమార్గం తవ్వి.. ఎప్పటిలాగే వాగు ప్రవహించేలా డిజైన్ చేశారు. 100 మీటర్ల పొడవు.. సుమారు 30 ఫీట్ల లోతు.. 25 ఫీట్ల వెడల్పుతో సైఫన్ నిర్మాణం చేపట్టారు. సైఫన్ సొరంగమార్గం ద్వారా కాలువ నీరు.. వాగులో వరద ప్రవాహం.. ఈ అద్భుత కట్టడం ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది.


సైఫన్ పైభాగం నుంచి ప్రవహిస్తున్న పెద్దవాగు


ఇంజనీర్ రామకృష్ణరాజు విగ్రహం

అనంతారం అద్భుతం


అనంతారం ప్రాజెక్టు

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలం అనంతారం ప్రాజెక్టు 500 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రాజెక్టు ఆయకట్టు దాదాపు 800 ఎకరాల వరకు ఉంటుంది. అనంతారం ప్రాజెక్టు నీటితో నిండితే బిక్కవాగు పరివాహక ప్రాంతమైన అనంతారం, రహీంఖాన్‌పేట, ఇల్లంతకుంట, వంతడుపుల, నర్సక్కపేట గ్రామాల్లోని పంటలకు సమృద్ధిగా సాగునీరు లభిస్తుంది.

డాక్ బంగ్లా

అనంతారం ప్రాజెక్టు పరిధిలోని డాక్ బంగ్లాను రెండెరాల విస్తీర్ణంలో నిర్మించారు. ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన ఇరిగేషన్ అధికారులు ఇక్కడే సేద తీరేవారు. డాక్‌బంగ్లా ఇల్లంతకుంట మండలంలో ప్రాముఖ్యత సంతరించుకుని ఉంది.


ప్రాజెక్టు డాక్ బంగ్లా

యువకుడిపై కత్తితో దాడి

జగిత్యాల క్రైం: జిల్లాకేంద్రంలోని కరీంనగర్ రోడ్డులో కట్ల శ్రీకాంత్ అనే యువకుడిపై సందీప్ అనే వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరచడంతో బాధితుడి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. పట్టణంలోని అంగడిబజార్‌కు చెందిన శ్రీకాంత్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. గోవిందుపల్లెకు చెందిన సందీప్ ఆటోడ్రైవర్. సందీప్‌కు ఓ పంచాయితీ ఉండడంతో శ్రీకాంత్‌ను మధ్యవర్తిగా తీసుకెళ్లాడు. అక్కడ తనకు కాకుండా ప్రత్యర్థులకు మద్దతు ఇస్తున్నాడని మనసులో పెట్టుకుని సందీప్.. రెండు రోజులుగా శ్రీకాంత్‌కు ఫోన్ చేసి బెదిరిస్తున్నాడు. ఆదివారం రాత్రి సమయంలో ఇద్దరూ కరీంనగర్ రోడ్డులో కలుసుకున్నారు. అక్కడ ఇద్దరి మధ్య మాటామాట పెరిగి శ్రీకాంత్‌పై తన వెంట తెచ్చుకున్న కత్తితో సందీప్ దాడికి పాల్పడ్డాడు. దాడిలో శ్రీకాంత్ చెవ్వు, మెడ, కడుపులో గాయాలయ్యాయి. స్థానికులు శ్రీకాంత్‌ను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీకాంత్ సోదరుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సందీప్ పరారీలో ఉన్నట్లు సమాచారం.

తల్వార్‌తో జన్మదిన వేడుకలు..

జగిత్యాల క్రైం: జిల్లాకేంద్రంలోని వాణినగర్‌కు చెందిన కోరుకంటి సాయికృష్ణ అనే వ్యక్తి రోడ్డుపై.. జనావాసాల మధ్య తల్వార్‌ను పట్టుకుని మిత్రులతో కలిసి జన్మదిన వేడుకలను జరుపుకోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కరుణాకర్ కథనం ప్రకారం సాయికృష్ణ శనివారం రాత్రి రోడ్డుపై ప్రజలు చూస్తుండగానే వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ తల్వార్ చేతపట్టుకుని మిత్రులతో కలిసి కేక్ కట్ చేశాడు. దీంతో పబ్లిక్ న్యూసెన్స్ కింద సాయికృష్ణపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కడుపునొప్పితో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


హారిక (ఫైల్)

మల్యాల: కడుపునొప్పితో మండలంలోని రామన్నపేటకు చెందిన ఇంటర్ విద్యార్థిని హారిక (16) ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. వెల్గటూర్ మండలం గొడిశెలపేటకు చెందిన ఒడిగ గంగాధర్, వరలక్ష్మి దంపతులు 15 ఏళ్ల క్రితం రామన్నపేటకు వచ్చి ఇక్కడే ఉంటున్నారు. గంగాధర్ లారీ డ్రైవర్. తల్లి వ్యవసాయ కూలీ. వీరి రెండో కూతురు హారిక జగిత్యాలలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండగా ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటోంది. అయినప్పటికీ తగ్గకపోవడంతో ఆదివారం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వరలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెగడపల్లి: మండలంలోని ఎల్లాపూర్‌కు చెందిన మల్లారపు సుప్రియ (27) చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందింది. ఎస్సై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. సుప్రియ కొంతకాలంగా థైరాయిడ్ వ్యాధితో బాధపడుతోంది. ఇటీవలే కామెర్ల వ్యాధిబారిన పడింది. ఆసుపత్రుల్లో చూపించుకున్నా ఆరోగ్యం కుదటపడలేదు. జీవితంపై విరక్తి చెంది ఈనెల 12న బ్లాక్‌రోజ్ పౌడర్ తాగింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. సుప్రియ తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కిష్టారావుపల్లిలో వృద్ధుడు..

రామడుగు(చొప్పదండి): మండలంలోని వెలిచాల గ్రామ పరిధి కిష్టారావుపల్లి గ్రామానికి చెందిన చాట్ల నర్సయ్య (65) చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. ఈ నెల 3న చాట్ల నర్సయ్యకు ఇదే గ్రామానికి చెందిన చాట్ల గంగారాం మధ్య గొడవ జరగడంతో పంచాయితీ నిర్వహించుకున్నారు. పంచాయితీ జరుగుతుండగా గంగారాం, నర్సయ్య మధ్య గొడవ జరిగింది. దీంతో గంగారాం కుమారుడు భాస్కర్ మా నాన్నను ఎందుకు తిడుతున్నావని నర్సయ్యపై ప్లాస్టిక్ కుర్చీతో దాడి చేయడంతో కిందపడిపోయాడు. వెంటనే అక్కడే ఉన్న సిమెంట్ రాయితో ముఖంపై కొట్టడంతో పాటు గంగారాం కూడా దాడి చేయడంతో నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. 6న బాధితుడిని కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం మరో ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడి కూతురు కళ్యాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్యాంక్ లోన్ ఇప్పిస్తానని మోసం

- రూ.1.25లక్షలు కాజేసిన కేటుగాడు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన ఒక వ్యక్తికి ముద్రలోన్ ఆఫీసర్ అని ఫోన్ చేసి రూ.5 లక్షల లోన్ ఇప్పిస్తానని నమ్మబలికాడు. ప్రాసెసింగ్ ఫీజుగా పలు దఫాలుగా రూ.1.25లక్షలు కాజేశాడు. అయినా లోన్ మంజూరుకాకపోవడంతో బాధితుడు ఆదివారం పోలీసులను ఆశ్రయించాడు. ఎస్సై కె.రాహుల్‌రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని సూచించారు.

రాయికల్ శివాలయంలో చోరీ

పోలీస్‌ల అదుపులో నిందితుడు?


రాయికల్ శివాలయంలో హుండీపగలగొట్టిన దొంగలు

రాయికల్: రాయికల్ పట్టణంలోని శివాలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఆలయంలోని హుండీని పగలగొట్టి నగదును దొంగలించారు. దొంగ ముందస్తుగా సీసీ కెమెరాలు పగలగొట్టి దొంగతనానికి ప్రయత్నించాడు. దానికి ముందు రికార్డయిన వీడియో ఆధారంగా ఆదివారం సదరు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

పోలీసుల అదుపులో యువకుడు

ఇల్లంతకుంట(మానకొండూర్):ఓ మైనర్ బాలిక నగ్న వీడియోలు చిత్రీకరించి, ఇతరులకు పంపించిన యువకుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. బాలిక నగ్న వీడియోలు తీసిన యువకుడు గతంలో గంజాయి కేసులో నిందితుడు అని ప్రచారంలో ఉంది. ఈ వీడియోలు ప్రస్తుతం వెలుగుచూడడంతో బాధిత బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. సదరు యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఇటీవల మండలానికి చెందిన ఓ మైనర్ బాలిక ఆత్మహత్య ఉదంతం మరిచిపోకముందే మరో మైనర్ నగ్న వీడియోలు చిత్రీకరించినట్లు వెలుగులోకి రావడం మండలంలో చర్చకు దారితీసింది.

పిడుగుపాటుకు కాలిపోయిన ట్రాక్టర్


కాలిపోయిన ట్రాక్టర్ స్టీరింగ్

సుల్తానాబాద్‌రూరల్: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కొదురుపాక గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున భారీవర్షం కురిసింది. ఈక్రమంలో పిడుగుపడి ట్రాక్టర్ స్టీరింగ్ కాలిపోయింది. గ్రామంలోని చెట్టుపై పిడుగుపడగా దానికిందనే పార్క్‌చేసిఉన్న గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్ కాలిపోయింది.

కనుపాపను కాపాడండి

- వెన్నుపూస సమస్యతో బాధపడుతున్న విద్యార్థిని
- బడిలో ఉండాల్సిన చిన్నారి ఆస్పత్రిలో..
- నిమ్స్‌లో చికిత్స పొందుతున్న సాత్విక
- శస్త్రచికిత్సకు రూ.4లక్షలు అవసరం
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు


నిమ్స్‌లో చికిత్స పొందుతున్న చిన్నారి సాత్విక, పక్కనే వేదనగా తల్లి భాగ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఇంట్లో చలాకిగా తిరగాలిస్న చిన్నారి ఆస్పత్రి బెడ్‌పై కదలలేని స్థితిలో ఉంది. ఆడపిల్ల పుట్టగానే సంతోషించిన తల్లిదండ్రులకు ఆమెకు వచ్చిన అనారోగ్య సమస్యతో వేదన మొదలైంది. చక్కగా బడికి వెళ్లే చిన్నారి వెన్నుముక సమస్యతో కాళ్లు చేతులు పడిపోవడంతో మంచానికే పరిమితమైంది. ఆపరేషన్ చేస్తే నడుస్తుందన్న వైద్యుల సూచనలతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు రూ.4లక్షలు అవసరం ఉంటాయని వైద్యులు తెలపడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన మిడిదొడ్డి భాగ్య–మల్లేశం దంపతులకు ఐదో తరగతి చదువుతున్న కూతురు సాత్విక ఉంది. నిత్యం చలాకీగా బడికి వెళ్లే చిన్నారి హఠాత్తుగా అనారోగ్యానికి గురైంది. నడవలేని స్థితిలో మంచానికే పరిమితం కావడంతో వైద్యులను సంప్రదించారు. పరీక్షలు చేసిన వైద్యులు వెన్నుపూసలో సమస్య ఉన్నట్లు గుర్తించారు. ఆపరేషన్‌కు రూ.4లక్షలు ఖర్చు అవుతుందని తెలపడంతో చేతిలో చిల్లిగవ్వలేని వారు ఆ డబ్బులు ఎలా సమకూర్చాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఈక్రమంలోనే కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలవగా.. స్పందించిన కలెక్టర్ రూ.74,938 చెక్కును అందించారు. దీంతో వారు చిన్నారిని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. శస్త్రచికిత్సకు ఈ మొత్తం సరిపోకపోవడంతో దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్నారు. సాయం చేయాల్సిన దాతలు మిడిదొడ్డి భాగ్యకు 96181 51488లో సాయం చేయాలని వేడుకుంటున్నారు.

బీరుసీసాలతో యువకుల దాడులు

- మద్యం మత్తులో వీరంగం
- ఇద్దరికి తీవ్రగాయాలు


గాయపడిన అనిల్

సుల్తానాబాద్‌రూరల్: మద్యం మత్తులో యువకులు బీరుసీసాలతో స్పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ఓ వైన్స్ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సుల్తానాబాద్‌లోని మార్కెండేయకాలనీకి చెందిన యువకులు అనిల్, టోనీ ఓ వైన్స్ వద్ద మద్యం తాగారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహంతో ఇద్దరూ బీరుసీసాలతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలుకాగా స్థానికులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వైద్యచికిత్స అందిస్తున్నారు.

పట్టపగలు వివాహిత దారుణ హత్య

- కుటుంబ కలహాలే కారణం
- భార్యను చంపిన భర్త


రమాదేవి(ఫైల్)

రామగిరి(మంథని): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం పన్నూర్ గ్రామ పంచాయతీ పరిధి వకీల్‌పల్లి ప్లాట్స్‌లో ఆదివారం పూసల రమాదేవి ఉరఫ్ ప్రశాంతి(35) దారుణ హత్యకు గురైంది. స్థానికుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా రెడ్డికాలనీకి చెందిన రమాదేవి ఉరఫ్ ప్రశాంతిని పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లి ప్లాట్స్‌కాలనీలో నివాసం ఉండే పూసల కృపాకర్ సుమారు 13 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు జాన్సన్, కుమార్తెలు జోషిత(9), జ్యోత్స్న ఉన్నారు. ఏడాదిగా వీరి మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. అప్పటినుంచి భార్యాభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. రమాదేవి ఆదివారం కృపాకర్ ఇంటికి చేరుకుంది. ఈక్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహంతో కత్తితో రమాదేవిపై కృపాకర్ దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో ఎస్సై శ్రీనివాస్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వివరాలు సేకరించారు. గోదావరిఖని ఏసీపీ రమేశ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్య అనంతరం కృపాకర్, అతడి తల్లిదండ్రులు పరారయ్యారు. అయితే, తల్లిదండ్రులు మంథని పోలీసు స్టేషన్‌లో ఉన్నట్లు సమాచారం. పోలీసులు కృపాకర్ కోసం ఆరా తీస్తున్నారు. కుటుంబ కలహాలే హత్యకు కారణామని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని ఎస్సై వివరించారు.


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రమేశ్

పంచాయితీయే ప్రాణం తీసిందా?

ఏడాదిగా వేర్వేరుగా ఉంటున్న రమాదేవి ఆదివారం అత్తగారింటికి వచ్చి ప్రాణాలు కోల్పోవడం కలకలం రేపింది. సెంటినరికాలనీకి చెందిన ఒకమతపెద్ద ద్వారా కృపాకర్ రాయబారం చేయడంతో రమాదేవిని అక్కడకు వచ్చిందని, మతపెద్ద సమక్షంలో పంచాయితీ జరిగిందని తెలిసింది. ఆ తర్వాత రమాదేవి వకీల్‌పల్లి ప్లాట్స్‌కాలనీకి చేరుగా.. భార్యాభర్తల మధ్య గొడవ జరిగిందని, ఈక్రమంలోన అత్తగారింటి ఎదుట రోడ్డుపై విగతజీవిగా పడిపోయిందని స్థానికులు కంటతడి పెట్టారు. క్షణికావేశంలో భార్యను చంపడంతో ముగ్గురు పిల్లలు రోడ్డున పడ్డారని ఆవేదన చెందారు. కుటుంబ కలహాలు పచ్చనికాపురంలో చిచ్చుపెట్టడంతో పిల్లలు దిక్కులేనివారయ్యారు.